VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ గురువారం 22 మే 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 306

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



## పుష్కరాలకు పోటెత్తుతున్న భక్తులు



2లో..

కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు హతం. మరో 27 మంది మావోల మృతి.

# ఛత్తీస్ ఘడ్‌లో భారీ "ఎన్కౌంటర్"

మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ

అగ్రనేత,పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు హతం

ధృవీకరించిన హోంమంత్రి అమిత్ షా

వచ్చే మార్చి కల్లా మావోయిస్టుల అంతం చేస్తాం

గణపతి తరవాత బాధ్యతలో చేపట్టిన నంబాల

కోటిన్నర రివార్డు ఉన్నట్లు పోలీస్ అధికారుల వెల్లడి

'నక్సలిజం నిర్మూలనలో ఇదొక మైలు రాయి విజయం అంటూ అమిత్ షా పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్‌లో జరిగిన ఆపరేషన్‌లో 27మంది మావోయిస్టులు మృతిచెందారు. వీరిలో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి, నక్సల్ ఉద్యమానికి వెన్నెముకగా ఉన్న నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు ఉన్నారు.



# భద్రతా బలగాలను అభినందించిన ప్రధాని

## ఎక్స్ వేదికగా నంబాల హతంపై స్పందన

**న్యూఢిల్లీ:** ఛత్తీస్‌గఢ్ లోని నారాయణపూర్ జిల్లాలో బుధవారం ఉదయం జరిగిన ఎదురుకాల్పుల్లో 27 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఎన్‌కౌంటర్‌పై ప్రధాని నరేంద్రమోదీ తాజాగా ఎక్స్ వేదికగా స్పందించారు. ఆపరేషన్‌లో పాల్గొన్న భద్రతా బలగాలను ప్రశంసించారు. 'మీ అద్భుత విజయాన్ని చూసి గర్విస్తున్నా. మావోయిజం ముప్పును నిర్మూలించి.. ప్రజలకు శాంతి, పురోగతితో కూడిన జీవితాన్ని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని పేర్కొన్నారు.ఎదురుకాల్పుల్లో మావోయిస్టు అగ్ర నేత నంబాల కేశవరావు (70) అలియాస్ బసవరాజు మృతి చెందినట్లు ఎక్స్ వేదికగా అమిత్ షా వెల్లడించిన సంగతి తెలిసిందే. 'నక్సలిజం నిర్మూలనలో ఇదొక మైలు రాయి విజయం. 2026 మార్చి 31 నాటికి నక్సలిజాన్ని నిర్మూలించేందుకు మోదీ సర్కార్ దృఢ సంకల్పంతో ఉంది' అని రాసుకొచ్చారు.మాధ్ ప్రాంతంలో పెద్దఎత్తున మావోయిస్టులు ఉన్నట్లు సమాచారం రావడంతో భద్రతా బలగాలు ఆపరేషన్ చేపట్టాయి. ఈ ఆపరేషన్‌లో బీజాపూర్, నారాయణపూర్, దంతెవాడ డీఆర్జీ బలగాలు పాల్గొన్నాయి. ఇటీవల ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దుల్లోని కరేగుట్ట పర్వతాల్లో 24 రోజులపాటు జరిగిన ఆపరేషన్‌లో 31 మంది మావోయిస్టులు మరణించిన సంగతి తెలిసిందే. వీరిలో 16 మంది మహిళలు ఉన్నారు.

## కావాలనే కాళేశ్వరం విచారణ జాప్యం

ఇంకెంతకాలం విచారణ చేయిస్తారు

నోటీసులు అందాక స్పందిస్తా..వచారణ కు హాజరవుతా

మల్కాజిగిరి ఎంపి ఈటెల రాజేందర్ స్పష్టీకరణ



2లో..

## శత్రుదేశంతో చర్చిస్తారు... మావోయిస్టులతో వద్దంటరా?.

దేశభక్తి అంటే దోచిపెట్టడం కాదు.

ఏది నిజమో? ఏది ఫేకో తెలియడం లేదు.

ఎన్కౌంటర్లపై జస్టిస్ చంద్రకుమార్ ఆగ్రహం



2లో..

## జస్టిస్ వర్మపై ఎఫ్ఐఆర్ దాఖలు చేయాలి

పిటిషన్ తోసిపుచ్చిన సుప్రీం ధర్మాసనం



2లో..

## రెండ్రోజుల పాటు తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు

ఈదురు గాలులతో కూడా వానలు పడే ఛాన్స్

అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించిన వాతావరణశాఖ



2లో..



## కాంగ్రెస్, బిజెపి కుమ్మక్కు రాజకీయాలు

కెసిఆర్‌కు నోటీసుల వెనక రెండు పార్టీల కుట్ర

ఎన్ని నోటీసులు ఇచ్చిన ధైర్యంగా ఎదుర్కొంటాం

కెసిఆర్‌కు నోటీసులపై కెటిఆర్ విమర్శలు

2లో..

# పాక్‌పై ప్రతీకారం తీర్చుకోవడంలో విఫలం

ట్రంప్ ఒత్తిడికి తలొగ్గిన మోడీ

రాజీవ్ వర్ధంతి కార్యక్రమంలో సిఎం రేవంత్

హైదరాబాద్: మోదీ ప్రభుత్వం ట్రంప్ ఒత్తిడికి లొంగిపోయిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పహల్గాం దాడి తర్వాత దేశం అంతా ముక్త కంఠంతో కేంద్ర ప్రభుత్వానికి అండగా నిలిచిందని.. కానీ పాకిస్తాన్ కు బుద్ధి చెప్పడంలో కేంద్రం ప్రభుత్వం విఫలమైందని అన్నారు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోకుండా మోదీ ప్రభుత్వం వెనకడుగు వేసిందని.. గొప్పల కోసం పార్టీ శ్రేణులను వీధుల్లో తిప్పుతున్నారని విమర్శించారు. బుధవారం రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా.. ఆయన విగ్రహానికి సీఎం రేవంత్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ దేశానికి వన్నె తెచ్చిన నేత రాజీవ్ గాంధీ అని ఈ సందర్భంగా కొనియాడారు. 18 ఏండ్లకే యువతకు ఓటు హక్కు కల్పించారని.. దేశంలో సాంకేతిక విప్లవాన్ని తీసుకొచ్చిన ఘనత రాజీవ్ గాంధీకి సొంతమని అన్నారు. 1971 పాకిస్తాన్ పై ఇందిరా గాంధీ యుద్ధం చేసి బలమైన గుణపాఠం చెప్పారని ఈ సందర్భంగా సీఎం గుర్తుచేశారు. పాక్‌ను రెండు ముక్కలు చేసి శాస్వత గుణపాఠం చెప్పారని అన్నారు. భారత్ పై తీవ్ర వాద ముసుగులో దాడి జరిగితే ఇందిరాగాంధీ తెగువ గుర్తు చేసుకొస్తుందని అన్నారు. దాదాపు 54 ఏండ్ల తర్వాత కూడా ఉక్కు మహిళ తెగువను ప్రపంచం గుర్తు చేసుకుంటుందని అన్నారు. తీవ్రవాదంపై పోరాడటం ప్రతి భారతీయుడి కర్తవ్యమని ఈ సందర్భంగా సీఎం రేవంత్ అన్నారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఆపరేషన్ కేంద్రానికి అండగా నిలిచామని.. క్యాండిల్ ర్యాలీతో తెలంగాణలో కేంద్రానికి మద్ధతుగా ర్యాలీ చేశామని గుర్తు చేశారు. దేశ వ్యాప్తంగా కంగ్రెస్ తో పాటు ప్రజలందరూ అండగా ఉన్నప్పటికీ.. ట్రంప్ ఒత్తిడికి లొంగిపోయి వచ్చిన అవకాశాన్ని మోదీ ప్రభుత్వం సద్వినియోగం చేసుకోలేదని విమర్శించారు. పాకిస్తాన్ విషయంలో అమెరికాకు లొంగిపోయి వెనకడుగు వేసిన మోదీ.. గొప్పల కోసం పార్టీ శ్రేణులను వీధుల్లో తిప్పుతున్నారని మండిపడ్డారు.



"పహల్గాం ఘటన నేపథ్యంలో దివంగత ప్రధాని ఇందిరా గాంధీ స్ఫూర్తిని దేశంలో ప్రతిఒక్కరూ గుర్తు తెచ్చుకున్నారు. దేశ పౌరులపై దాడులకు తెగబడితే ఆనాడు ఇందిరమ్మ పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పారు. మా దేశాన్ని మేం రక్షించుకోగలుగుతాం.. ఎవరి మధ్యవర్తిత్వం అవసరం లేదని ఆమె ఆనాడే స్పష్టం చేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెబితే కాల్పుల విరమణ చేసిన పరిస్థితి ఇప్పటి కేంద్ర ప్రభుత్వానిది. రాహుల్ గాంధీని విమర్శించడం ద్వారా భాజపా నాయకులు తమ చేతగానితనాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు.

# మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతకు షాక్

గాంధీభవన్‌లో ధర్నా చేసినందుకు నోటీసులు



హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు సునీతా రావుకు పార్టీ అధిష్టానం షోకాజ్ నోటీసులిచ్చింది. టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్‌పై చేసిన వ్యాఖ్యలు, గాంధీ భవన్‌లో నిరసన చేయడాన్ని కాంగ్రెస్ అధిష్టానం తప్పుబట్టింది. క్రమశిక్షణను ఉల్లంఘించినందుకు సునీతా రావుకు జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నోటీసు జారీ చేశారు. సునీతా రావుకు ఏమైనా ఇబ్బంది ఉంటే పార్టీలో చర్చించాలి కానీ బహిరంగంగా మాట్లాడడం తప్పని.. దీనిపై 7 రోజుల్లో వివరణ ఇవ్వాలని జాతీయ మహిళా కాంగ్రెస్ లేఖలో పేర్కొంది. వివరణ ఇవ్వకపోతే కాంగ్రెస్ నిబంధనల మేరకు చర్యలు ఉంటాయని నోటీసులో అధిష్టానం స్పష్టం చేసింది. కొద్ది రోజుల క్రితం గాంధీభవన్‌లో సునీతా రావు నిరసన తెలిపిన విషయం తెలిసిందే. ముఖ్యంగా పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌పై పలు వ్యాఖ్యలు చేశారు. టీపీసీసీ చీఫ్ ఛాంబర్ ఎదుట సునీతారావు ధర్నాకు దిగారు. పది మంది మహిళా నాయకులతో కలిసి నిరసన చేపట్టారు. కాంగ్రెస్ మహిళా నేతలకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని.. పోస్టుల విషయంలో మహిళా నాయకులను పార్టీ పట్టించుకోవడం లేదని ఆమె ఆరోపించారు. ప్రభుత్వం, కార్పొరేషన్ పదవుల్లోనూ మహిళా నేతలకు సరైన ప్రాధాన్యత దక్కడం లేదని విమర్శించారు. మహేష్ గౌడ్ బంధువులకే పదవులు కట్టబెడు తున్నారంటూ ఆరోపణలు గుప్పించారు. కార్పొరేషన్లు, పార్టీ కమిటీల్లో మహిళా కాంగ్రెస్ నేతలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ సునీతారావు గాంధీభవన్‌లో ఆందోళనకు దిగారు. క్రమంలో అధికార పార్టీలో ఉంటూ పార్టీ ఆఫీసులో నిరసన చేపట్టడాన్ని అధిష్టానం తీవ్రంగా తప్పుబట్టింది. అలాగే టీపీసీసీ చీఫ్‌పై ఆరోపణలు చేయడాన్ని మహిళా కాంగ్రెస్ జాతీయ నాయకత్వం తప్పుబట్టింది. దీనిపై వివరణ ఇవ్వాల్సిందిగా సునీతారావుకు జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నోటీసులు జారీ చేశారు.

వేగుచుక్క

# ఛత్తీస్ ఘడ్‌లో భారీ "ఎన్కౌంటర్"



బీజాపూర్: ఛత్తీస్‌గఢ్ మరోసారి తుపాకీ మోతతో దద్దరిల్లింది. మావోయిస్తులకు భారీ దెబ్బ పడింది. ఎన్‌కౌంటర్‌లో అగ్రనేత సహా మొత్తం 27మంది హతమయ్యారు. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు అగ్ర నేత నంబాల కేశవరావు (70) అలియాస్ బసవరాజు మృతి చెందారు. ఈ విషయాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఎక్స్‌లో వెల్లడించారు. బుధవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 27 మంది మావోయిస్టులు మృతి చెందారు. వారిలో నంబాల కేశవరావు ఉన్నట్లు పోలీసులు ధ్రువీకరించారు. కేశవరావుపై రూ. 1.5కోట్లు రివార్డు ఉందని తెలిపారు. 'నక్సలిజం నిర్మూలనలో ఇదొక మైలు రాయి విజయం అంటూ అమిత్ షా పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్‌లో జరిగిన ఆపరేషన్‌లో 27మంది మావోయిస్టులు మృతిచెందారు. వీరిలో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి, నక్సల్ ఉద్యమానికి వెన్నెముకగా ఉన్న నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు ఉన్నారు. నక్సలిజానికి వ్యతిరేకంగా కొనసాగిస్తున్న మూడు దశాబ్దాల పోరులో ప్రధాన కార్యదర్శి స్థాయి కలిగిన నేత మృతి చెందడం ఇదే తొలిసారి. ఈ క్రమంలో భద్రతా దళాలకు అభినందనలు తెలిపారు. ఆపరేషన్ బ్లాక్ ఫారెస్టు పూర్తయిన తర్వాత ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మహారాష్ట్రలలో 54మంది నక్సలైట్లు అరెస్టు అయ్యారు. 84మంది లొంగిపోయారు. 2026 మార్చి 31 నాటికి నక్సలిజాన్ని నిర్మూలించేందుకు మోదీ సర్కార్ దృఢ సంకల్పంతో ఉంది' అని అమిత్ షా ఎక్స్‌లో పేర్కొన్నారు. ఎన్‌కౌంటర్‌లో మరణించిన నంబాల కేశవరావును బసవరాజు, క్రిష్ణ, వినయ్, గంగన్న, బసవర రాజు, ప్రకాష్, బీఆర్, ఉమేష్, రాజు, విజయ్, కేశవ్, దారపు నరసింహారెడ్డి, నరసింహ అని మారు పేర్లతో కూడా పిలిచేవారు. 2018 నవంబర్‌లో ముప్పాల లక్ష్మణరావు అలియాస్ గణపతి రాజీనామా తర్వాత అతను పార్టీకి సుప్రీం కమాండర్ అయ్యారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం జియ్యన్నపేట గ్రామంలో 1955లో కేశవరావు జన్మించారు. తండ్రి వాసుదేవరావు ఉపాధ్యాయుడు. కేశవరావుకు సోదరుడు, ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఉన్నారు.కేశవరావు ప్రాథమిక విద్య స్వగ్రామంలోనే సాగింది. తాతగారి ఊరు అయిన టెక్కలి మండలం తలగాంలో హైస్కూల్ విద్య, టెక్కలి జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివిన ఆయన.. డిగ్రీ రెండో సంవత్సరం చదువుతుండగా వరంగల్‌లో బీటెక్ రావడంతో అక్కడికి వెళ్లి జాయిన్ అయ్యారు. వరంగల్‌లోని రీజినల్ ఇంజినీరింగ్ కళాశాల (ఆర్ఈసీ) బీటెక్ చదువుతుండగానే రాడికల్ విద్యార్థి సంఘం వైపు అడుగులు వేశారు. 1984లో ఎంటెక్ చదువుతున్నప్పుడు సీపీఐ(ఎంఎల్) పీపుల్స్‌వార్ గ్రూపు సిద్ధాంతాలు, భావజాలం పట్ల ఆకర్షితులయ్యారు. ఎంటెక్ చదువుకు మధ్యలోనే స్వస్తి చెప్పి ఉద్యమంలో చేరారు. అప్పటి నుంచి 43 ఏళ్లుగా అజ్ఞాతంలోనే ఉన్నారు. నక్సల్‌బరి ఉద్యమంలో చేరాక స్వగ్రామానికి ఎప్పుడూ రాలేదని గ్రామస్థులు చెబుతున్నారు. మిలటరీ దాడుల వ్యూహకర్తగా నంబాల కేశవరావుకు పేరుంది. మిలిటరీ ఆపరేషన్లలో సిద్ధహస్తులు. మిలటరీ వ్యూహాల రూపకల్పన, అమలు, ఆయుధాల వ్యాపారులతో సత్సంబంధాలు నెరపడం ఆయన ప్రత్యేకతలు. దశాబ్దకాలం పాటు కేంద్ర మిలటరీ కమిషన్ కార్యదర్శిగా పనిచేశారు. గణపతి తర్వాత పార్టీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. గణపతితో పోల్చితే పార్టీ సిద్ధాంతాల అమల్లో మరింత కఠినంగా వ్యవహరించేవారు. దూకుడు స్వభావం కలిగిన కేశవరావు.. ప్రతిఘటన ద్వారానే లక్ష్యం సిద్ధిస్తుందని బలంగా నమ్మే స్వభావమని ఓ పోలీసు అధికారి తెలిపారు. అలిపిరిలో చంద్రబాబుపై జరిగిన క్లెమోర్ మైన్స్ దాడిలో ప్రధాన సూత్రధారి నంబల కేశవరావు. ముఖ్యంగా 2010 ఏప్రిల్లో ఛత్తీస్‌గఢ్‌లోని చింతల్నార్ ఘటనలో వ్యూహం ఆయనదే. గస్తీకి వెళ్లి తిరిగివస్తున్న సీఆఆర్పీఎఫ్ జవాన్లు రెండు కొండల మధ్యకు వచ్చాక మావోలు అకస్మాత్తుగా విరుచుకుపడ్డారు. జవాన్లు పారిపోయే అవకాశం కూడా దక్కలేదు. ఈ ఘటనలో 74 మంది జవాన్లు చనిపోయారు. 2013లో సల్వాజుడుం వ్యవస్థాపకుడు మహేంద్రకర్మపై దాడి వ్యూహం కూడా కేశవరావుదే. ఈ ఘటనలో మహేంద్రకర్మతోపాటు మరో 27 మంది మరణించారు.

## జస్టిస్ వర్మపై ఎఫ్ఐఆర్ దాఖలు చేయాలి

### పిటిషన్ తోసిపుచ్చిన సుప్రీం ధర్మాసనం

న్యూఢిల్లీ: అక్రమ నోట్ల కట్టలు వెలుగుచూసిన కేసులో హైకోర్టు జడ్జి యశ్వంత్ వర్మపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు బుధవారం తోసిపుచ్చింది. జస్టిస్ వర్మపై ఎఫ్ఐఆర్ దాఖలుకు నిరాకరించింది. జస్టిస్ వర్మ ప్రతిస్పందనతో పాటు మాజీ సిజెఐ రాష్ట్రపతి, ప్రధానులకు రాసిన లేఖలు, అంతర్గత విచారణ కమిటీ నివేదిక, మే 8న సుప్రీంకోర్టు విడుదల చేసిన పత్రికా ప్రకటనను పరిశీలించినట్లు జస్టిస్ అభరు ఎస్.ఓకా, జస్టిస్ ఉజ్వల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం తెలిపింది. మాండమస్ రిట్ కోరే ముందు, పిటిషనర్ తగిన అధికారుల ముందు ప్రాతినిథ్యం దాఖలు చేయడం ద్వారా తమ ఫిర్యాదును పరిష్కరించుకోవాలని ధర్మాసనం పేర్కొంది. ఈ రిట్ పిటిషన్‌ను స్వీకరించేందుకు తాము నిరాకరిస్తున్నామని, ఈ దశలో ఇతర విజ్ఞప్తులను పరిశీలించాల్సిన అవసరం లేదని ధర్మాసనం తెలిపింది. జస్టిస్ వర్మపై అంతర్గత విచారణ కమిటీ అభియోగం మోపిన తర్వాత మాజీ సిజెఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా ఆయనను రాజీనామా చేయాల్సిందిగా ఆదేశించారు. అయితే రాజీనామా చేసేందుకు జస్టిస్ వర్మ నిరాకరించారు. దీంతో జస్టిస్ సంజీవ్ ఖన్నా రాష్ట్రపతి, ప్రధాని మోడీలకు లేఖ రాసిన సంగతి తెలిసిందే. జస్టిస్ వర్మపైప వచ్చిన ఆరోపణలు వాస్తవమని అంతర్గత కమిటీ తేల్చిందని, వెంటనే క్రిమినల్ చర్యలు చేపట్టాలంటూ న్యాయవాది మాథ్యూస్ నెడుంపారా, మరో ముగ్గురు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అంతర్గత విచారణతో న్యాయపరమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోవచ్చని, అయితే చట్టాల ప్రకారం.. క్రిమినల్ దర్యాప్తుకు ప్రత్యామ్నాయం కాదని పిటిషన్‌లో వారు లేవనెత్తారు. అంతర్గత విచారణను సవాలు చేస్తూ, అధికారిక పోలీస్ దర్యాప్తు చేయాలని డిమాండ్ చేస్తూ మార్చిలో ఈ పిటిషనర్లే సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

## రెండ్రోజుల పాటు తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు

విశాఖపట్టణం/హైదరాబాద్: తెలుగు రాష్టాల్లో పలుచోట్ల భారీ వర్షాలు కురుస్తున్నాయి. రానున్న ఐదు రోజుల పాటు కూడా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. కోస్తా పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న ద్రోణి మరో 12 గంటల్లో అల్పపీడనంగా మారే అవకాశం ఉందని, 36 గంటల్లో అల్పపీడనం మరింత బలపడి వాయుగుండంగా మారే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని అంటున్నారు. రెండ్రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, మరో ఐదు రోజుల పాటు కూడా ఈదురుగాలులతో కూడా వర్షాలు పడనున్నాయని అధికారులు తెలిపారు. గంటకు 40 నుంచి 50 కిలో మీటర్ల వేగంతో పలు జిల్లాలో వర్షం పడే అవకాశం ఉందంటున్నారు. పశ్చిమ, తూర్పు జిలాలకు భారీ వర్షాలు పడతాయని తెలిపారు. అటు తెలంగాణలోనూ పలు రాష్టాల్లో కుండపోత వర్షాలు పడనున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. 15 జిల్లాలకు భారీ వర్ష సూచన ఉందని అధికారులు వెల్లడించారు. హైదరాబాద్, నిజామాబాదు, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ, గద్వాల్, నగర్ కర్నూల్, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌బాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భారీ వర్షాలు కురవనున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ద్రోణి ప్రభావంతో తెలంగాణ రాగల ఐదురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఉత్తర కర్నాటక-గోవా తీరాల వెంబడి తూర్పు మధ్య అరేబియా సముద్రంపైనున్న ఉపరితల ఆవర్తం నుంచి కోస్తాంధ్ర వరకు ద్రోణి సగటు సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉందని.. ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంతాలు, పరిసరాలను ఆనుకొని ఉన్న దక్షిణ తెలంగాణపై ఉపరితల ఆవర్తనం సగటు సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల విస్తరించి ఉందని వాతావరణశాఖ పేర్కొంది. ఈ క్రమంలో నిజామాబాద్, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. భూపాలపల్లి, ములుగు, వరంగల్, హన్మకొండ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని చెప్పింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వానలు పడే అవకాశాలున్నాయని చెప్పింది.

గురువారం కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం జిల్లాల్లో అక్కడక్కడ భారీ వానలుపడుతాయని తెలిపింది. కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్,

వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని చెప్పింది. అలాగే, శుక్ర, శని, ఆదివారాల్లోనూ హైదరాబాద్ సహా ఉత్తర, దక్షిణ తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వానలు పడుతాయని వాతావరణశాఖ వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ని జారీ చేసింది

# ఎపికి ఆరు కుంకీ ఏనుగుల అప్పగింత




**బెంగళూరు:** కర్నాటక నుంచి కుంకీ ఏనుగులు వచ్చాయి. ఏపీకి ఆరు కుంకీ ఏనుగులను కర్ణాటక ప్రభుత్వం అప్పగించింది. బెంగళూరులోని విధానసౌధలో కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. కుంకీ ఏనుగుల అప్పగింత, వాటి సంరక్షణకు సంబంధించిన డాక్యుమెంట్లను పవన్‌కు సిద్ధరామయ్య అందజేశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ కుంకీ ఏనుగులు ఇచ్చిన కర్ణాటక ప్రభుత్వానికి, సీఎం సిద్ధరామయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. ఎలాంటి సాయం అడిగినా కర్ణాటక ప్రభుత్వం ముందుకొస్తోందన్నారు. ఏపీ, కర్ణాటక మధ్య సహకారం ఇలాగే కొనసాగాలని పవన్ ఆకాంక్షించారు. కుంకీ ఏనుగుల సంరక్షణకు ప్రత్యేక కేంద్రం

ఏర్పాటు చేశామని తెలిపారు. ఏపీ, కర్ణాటక మధ్య 9 ఒప్పందాలు కుదుర్చుకున్నామన్నారు. పంటపొలాల్ని నాశనం చేస్తున్న అడవి ఏనుగులను నియంత్రించేందుకు కుంకీ ఏనుగులను రంగంలోకి దించుతారు.

కుంకీలు పూర్తి స్థాయిలో శిక్షణ పొందిన ఏనుగులు. ఎక్కడైనా ఏనుగుల గుంపు దాడికి దిగినప్పుడు కుంకీలను రంగంలోకి దింపుతారు. ఏనుగులను తరిమికొట్టడంలో ఇవి కీలక భూమిక పోషిస్తాయి. కొన్నిసార్లు గాయపడిన లేదా చిక్కుకున్న అడవి ఏనుగును రక్షించడానికీ వీటిని ఉపయోగిస్తారు. సాధారణంగా కుంకీ ఏనుగులుగా మగవాటినే ఎంపిక చేసుకుంటారు. ఎందుకంటే ఇవి మాత్రమే ఒంటరిగా సంచరిస్తుంటాయి. వీటిని బంధించి కొన్ని నెలల పాటు శిక్షణ ఇస్తారు. తర్వాత ఆపరేషన్ల కోసం వాడుతుంటారు. ఏనుగుల గుంపును అడవిలోకి తిరిగి పంపించేంత వరకు ఇవి విశ్రమించవు. కొన్నిసార్లు పంట పొలాలపైకి వచ్చిన ఏనుగులతో ఇవి తలపడాల్సి ఉంటుంది కూడా. అందుకే పోరాడడంలోనూ వీటికి ప్రత్యేక శిక్షణ ఇస్తారు.

ఏజెన్సీ ఏరియాల్లో ఏనుగుల వల్ల పలు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడించారు. చిత్తూరు జిల్లాలోని పలు ప్రాంతాలతోపాటు శ్రీకాకుళం, సాలూరు ప్రాంతాల్లో ఈ సమస్య అధికంగా ఉందన్నారు. అటవీ భూమిని ఆక్రమించడం వల్ల ఏనుగులే జనవాసాల్లోకి వస్తున్నాయో లేక ఏం జరుగుతుందో తెలియడం లేదన్నారు. కానీ ఈ తరహా సమస్యను కర్ణాటక ప్రభుత్వం చాలా పకడ్బందీ ప్రణాళికతో నిరోధిస్తుందని తెలిపారు. అందులో భాగంగా ఈ ప్రభుత్వం చాలా ఏనుగులకు శిక్షణ ఇచ్చిందన్నారు. అంతేకాకుండా అవి ఎలా వ్యవహరించాలో కూడా శిక్షణ ఇచ్చారని చెప్పారు. ఇక ఏనుగులు జనావాసా ప్రాంతంలోకి రాకుండా..

వాటికి ప్రత్యేక మార్గం ద్వారా వెళ్లేలా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. తద్వారా ఆ ప్రాంతంలోని రైతుల భద్రతతో పాటు సురక్షిత చర్యలు తీసుకున్నట్లు అవుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు, శ్రీకాకుళం జిల్లాలోని పలు ఏజెన్సీ ప్రాంతాల్లో ఏనుగులు ఊళ్లలోకి దూసుకు వచ్చి.. పంట పొలాలను నాశనం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ దాడుల కారణంగా పలువురు మృత్యువాత పడుతున్నారు. ఏ సమయంలో ఎటువైపు నుంచి ఏనుగులు దాడి చేస్తాయో తెలియన ఓ విధమైన భయాందోళన పరిస్థితి ఆ ప్రాంత ప్రజల్లో నెలకొంది. అంతేకాకుండా.. ఈ ఏనుగుల దాడి కారణంగా.. పలు గ్రామాల ప్రజలు ఇప్పటికే సురక్షిత ప్రాంతాలకు తరలిపోయారు.

## కాంగ్రెస్, బిజెపి కుమ్మక్కు రాజకీయాలు

**నల్లగొండ:** నోటీసులు ఎన్ని ఇచ్చినా ధైర్యంగా ఎదుర్కొంటామని,బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు ఇచ్చిన నోటీసులపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ స్పందించారు. చట్టాలు, న్యాయ వ్యవస్థపై తనకు నమ్మకం ఉందని, కాంగ్రెస్, బిజెపి ఆడుతున్న నాటకంలో భాగంగానే నోటీసులు ఇచ్చారని మండిపడ్డారు. ప్రజా సమస్యలు గాలికొదిలి తమకు నోటీసులిస్తున్నారని, దిక్కుతోచని పరిస్థితుల్లోనే కెసిఆర్‌కు నోటీసులు ఇచ్చారని కెటిఆర్ మండిపడ్డారు. ప్రజాపాలన కమిషన్ల పాలనగా మారిందని ధ్వజమెత్తారు. కమిషన్లు తప్ప రేవంత్ ప్రభుత్వానికి పాలన చేతకాదు అని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యేలు, మంత్రులే కమిషన్లపై మాట్లాడుతున్నారని, ఎన్ని నోటీసులు ఇచ్చినా దూదిగింజల్లా ఎగిరిపోతాయన్నారు. కాళేశ్వరం దర్యాప్తు కీలక దశకు చేరుకున్న సందర్భంగా మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రులు హరీష్‌రావు, ఈటల రాజేందర్‌లు విచారణకు రావాలని జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ నోటీసులు జారీచేసింది. ముగ్గురు హాజరయ్యేందుకు 15 రోజులు గడువును కమిషన్ ఇచ్చింది. కమిషన్ ఎదుట హాజరై కమిషన్ అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలని జస్టిస్ పిసి ఘోష్ ఈ నోటీసుల్లో పేర్కొన్న విషయం తెలిసిందే.

ఈ రాష్ట్రంలో కొనసాగుతున్నది ప్రజా పాలన కాదు.. కమిషన్ల పాలన అని కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. గత 17 నెలలుగా పాలన చేతకాక, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించే నాటకాలు ఆడుతోంది అని ధ్వజమెత్తారు. కమిషన్‌లు తప్ప ప్రభుత్వానికి మరో దారి కనిపించట్లేదు. పాలన కనిపించడం లేదు. డైరెక్టగా కాంట్రాక్టర్లు సచివాలయంలో ధర్నా చేయడం వాస్తవ పరిస్థితిని స్పష్టం చేస్తోంది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులే కమిషన్‌లు లేనిదే పనులు జరుగడంలేదు అని స్వయంగా చెబుతున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ని అడుగుతున్నా.. ఎస్ఎల్‌బిసి టన్నెల్ కూలింది, 8 మంది ప్రాణాలు కోల్పోయారు. అక్కడ సహాయక చర్యలు చేపట్టే తెలివి కూడా లేకపోయింది. మీ

కమిషన్‌ల ఆరాటంతో మృతదేహాలను వెలికితీయడానికి సైతం సాహసం చేయలేకపోయారు. అక్కడ ఏం జరిగిందో ఇప్పటికీ చెప్పలేని దద్దమ్మ ప్రభుత్వం ఇది. నల్గొండలో సుంకిశాల ప్రాజెక్ట్ కూలింది, ఇప్పటికీ ప్రభుత్వం స్పందించలేదు అని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేసి.. కాంగ్రెస్, బీజేపీ కలిసి నాటకాలు ఆడుతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టుపై కుట్రలు చేస్తూ రాష్ట్ర అభివృద్ధిని బలిగొంటున్నారు. ఎప్పటికైనా న్యాయం, ధర్మం గెలుస్తాయి. నిజాయితీ ఎప్పటికీ ఓడిపోదు. మీరు ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేయలేని చేతకాని ప్రభుత్వం ఇది. తులం బంగారం ఏమైంది? 4 వేల రూపాయల పింఛన్లు ఏమయ్యాయి? మీరు ఎన్ని నోటీసులు ఇచ్చినా అవి దూది పింజల్లా ఎగిరిపోతాయి. మీవి అన్ని చిల్లర ప్రయత్నాలు మాత్రమే. ప్రజలు మిమ్మల్ని తిరస్కరించనున్నారు. రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పే రోజులు త్వరలోనే వస్తాయి.

# కావాలనే కాళేశ్వరం విచారణ జాప్యం



హైదరాబాద్:కాళేశ్వరం కమిషన్ ఎదుట విచారణను కాలయాపన చేస్తూ..కేసును నీరు గారుస్తున్నారని మల్కాజ్‌గిరి ఎంపీ, బీజేపీ నేత ఈటల రాజేందర్ ఆరోపించారు. ఇంకెంతకాలం విచారిస్తారని అన్నారు. ఇదంతా కావాలనే చేస్తున్నట్లుగా ఉందని అన్నారు. ఇక తనకు నోటీసులపై స్పందిస్తూ విచారణకు వందశాతం హాజరవుతానని రాజేందర్ స్పష్టం చేశారు. అయితే ఇంత వరకు ఎలాంటి నోటీసులు తనకు అందలేదని ఆయన తెలిపారు. అయితే తనకు నోటీసులు పంపిన విషయం మీడియా ద్వారా తెలుసుకున్నానని చెప్పారు. తనకు నోటీసులు అందిన అనంతరం ఈ విషయాన్ని పార్టీలో చర్చించి.. అధిష్టానం నిర్ణయానికి అనుగుణంగా తాను ముందుకు వెళ్తానన్నారు. బుధవారం ఎంపీ ఈటల రాజేందర్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం నీది.. నువ్వు ఎలాంటి విచారణ అయినా చేయి అంటూ సీఎం రేవంత్ రెడ్డికి ఆయన సవాల్ విసిరారు. గతంలో దేవరాయాంజాల్ భూముల విషయంలో కేసీఆర్ చేసిన తప్పే.. నేడు నువ్వు చేస్తున్నావంటూ సీఎం రేవంత్ రెడ్డిపై ఈటల రాజేందర్ మండిపడ్డారు. నువ్వు మమల్ని బెదిరిస్తే భయపడమన్నారు. కేంద్రంలో తమ పార్టీనే అధికారంలో ఉందని ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ గుర్తు చేశారు. నీ చిట్టా అంతా తమ చేతిలో ఉందన్నారు. నీ దిక్కుమాలిన చిల్లర గాళ్ళతో మాట్లాడిస్తే తాను వెనక్కి పోనంటూ సీఎం రేవంత్ రెడ్డికి ఎంపీ ఈటల ఘాటుగా వార్నింగ్ ఇచ్చారు.

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా మేడిగడ్డ బ్యారేజీని కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిర్మించారు. అయితే ఈ బ్యారేజీలోని పలు పిల్లర్లు 2023లో కుంగాయి. ఈ అంశం నాటి ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ తన ప్రచారాస్త్రంగా మలుచుకుంది. 2024లో ఎన్నికల ప్రచారంలో భాగంగా తాము అధికారంలోకి వస్తే.. సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జితో ఈ బ్యారేజీ నిర్మాణంపై విచారణ జరిపిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఇక ఆ ఎన్నికల్లో తెలంగాణ ఓటరు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాడు. దీంతో రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు తీరింది. నంతరం ఈ అంశంపై సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి పీసీ ఘోష్ సారథ్యంలో విచారణ కమిషన్‌ను రేవంత్ రెడ్డి ప్రభుత్వం నియమించింది. ఈ కమిషన్ విచారణలో భాగంగా పలువురు ఉన్నతాధికారులతోపాటు సిబ్బందిని సైతం ప్రశ్నించింది. అలాగే పలువురు స్వచ్ఛందంగా ఈ విచారణకు హాజరై.. పలు విషయాలను జస్టిస్ పీసీ ఘోష్‌కు వివరించారు. ఈ నేపథ్యంలో సీఎం కేసీఆర్‌తోపాటు ఆయన కేబినెట్‌లో మంత్రులుగా వ్యవహరించిన హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌లకు కమిషన్ నోటీసులు జారీ చేసింది. జూన్ 5వ తేదీన కేసీఆర్, జూన్ 6వ తేదీన హరీశ్ రావు.. అలాగే జూన్ 9వ తేదీన ఈటల రాజేందర్ కమిషన్ ముందు హాజరు కావాలని ఆ నోటీసుల్లో కమిషన్ స్పష్టం చేసింది. కేసీఆర్ కేబినెట్‌లో భారీ నీటి పారుదల శాఖ మంత్రిగా హరీశ్ రావు, ఆర్థిక శాఖ మంత్రిగా ఈటల రాజేందర్ పని చేసిన సంగతి తెలిసిందే.

## శత్రుదేశంతో చర్చిస్తారు... మావోయిస్టులతో వద్దంటరా?.



వరంగల్: దేశభక్తి అంటే ప్రజల బాగోగులు చూడడమేనని, అంబానీ, ఆదానికి సంపద దోచీ పెట్టడం కాదని, శత్రుదేశంతో చర్చలు జరిపిన కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా మావోయిస్టులతో చర్చలు జరపాలని పీస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు జస్టిస్ చంద్రకుమార్ విజ్ఞప్తి చేశారు. చత్తీస్ గడ్ అటవీ ప్రాంతంలో భయానక పరిస్థితులు నెలకొన్నాయని ఆరోపించారు. బుధవారం జరిగిన ఎన్కౌంటర్ పై ఆయన స్పందించారు. ఏదీ ఎన్ కౌంటర్ రో, ఏదో ఫేకో తెలియడం లేదన్నారు. మేము శాంతి చర్చలకు పిలుపునిస్తే మావోయిస్టులు స్పం దించారు. కాల్పుల విరమణ ప్రకటించారు. ఇతర రాజకీయ పార్టీలు ఒప్పుకున్నాయి. కానీ కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ మాట్లాడే ప్రయత్నం చేశాను. బండి సంజయ్ చర్చలే లేవంటున్నారు. మావోయిస్టులు చర్చ లకు ఒప్పుకున్నాక వేలాది బలగాలతో వారిని చంపడం ధర్మమేనా? ఇది ఆర్టికల్ 21కి వ్యతి రేకం. గతంలో నాగాలాండ్, మేఘాలయాల్లో ఉగ్రవాదులతో, త్రిపుర, అస్సాం, మణిపూర్ లో తిరుగుబాటుదారులతో చర్చలు జరిపారనీ గుర్తు చేశారు. ఇప్పుడు మావోయిస్టులతో చర్చలు జరిపితే తప్పేంటీ?' అని ప్రశ్నించారు.

# పుష్కరాలకు పోటెత్తుతున్న భక్తులు

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో దక్షిణ త్రివేణి సంగమంగా పేరొందిన కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాలు ఘనంగా కొనసాగుతున్నాయి. భక్తులు తెలంగాణ నలుమూలల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. కేవలం కొన్నిరోజులే పుష్కరాలు ఉండడంతో భక్తులు భారీగా తరలివస్తున్నారు. మహిళలు నదీ తీరాన దీపారాధన, ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీకాళేశ్వర ముక్తేశ్వర స్వామివారిని దర్శించుకుంటున్నారు. పుష్కరాల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరేతో కలిసి పర్యవేక్షించారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్షణ బోటులో వారు ప్రయాణించారు.



వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...

# భూముల మార్కెట్ విలువ పెంపు..

తెలంగాణ: రియల్ ఎస్టేట్ వృద్ధితో భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. అయితే ప్రభుత్వ రికార్డుల్లో మాత్రం తక్కువ విలువలు ఉండటంతో సర్కార్ ఆదాయానికి గండి పడుతోంది. ఈ వ్యత్యాసాన్ని తగ్గించి, ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం భూముల మార్కెట్ విలువలను సవరించాలని నిర్ణయించింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలతో మార్కెట్ విలువల కేంద్ర మదింపు సలహా కమిటీ దీనిపై చర్చించింది. ప్రైవేట్ ఏజెన్సీ నివేదిక ఆధారంగా, పెంపు శాస్త్రీయంగా ఉండాలని సూచించారు. త్వరలోనే పెంపుపై తుది నిర్ణయం వెలువడనుంది.

తెలంగాణలో రియల్ ఎస్టేట్ రంగం వేగంగా వృద్ధి చెందుతోంది. భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. అయితే మారు మూల పల్లెల్లోనూ ఎకరం లక్షల్లో పలుకుతుండగా.. ప్రభుత్వ రికార్డుల్లోని వాటి విలువలు తక్కువగా ఉంటుంది. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది. భూముల మార్కెట్ విలువ, రిజిస్ట్రేషన్ వాల్యూ మధ్య వ్యత్యాసాన్ని తగ్గించి ప్రభుత్వ ఆదాయాన్ని పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. భూముల మార్కెట్ విలువలను పెంచేందుకు వేగంగా అడుగులు వేస్తోంది. ఇటీవల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో జరిగిన వనరుల సమీకరణ సమావేశంలో భూముల విలువ పెంపుపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు సూచించారు. దీనితో రాష్ట్ర స్థాయిలో మార్కెట్ విలువల కేంద్ర మదింపు సలహా కమిటీ సమావేశమై ఈ అంశంపై చర్చించింది. గతంలోనే ఒక ప్రైవేట్ ఏజెన్సీతో భూముల విలువ పెంపుపై అధ్యయనం చేయించిన ప్రభుత్వం, ఆ నివేదిక ఆధారంగా ఆదాయాన్ని పెంచే మార్గాలను పరిశీలించాలని రిజిస్ట్రేషన్ శాఖకు సూచించింది. పలు దఫాలు సమావేశమైన అధికారులు తమ అభిప్రాయాలను ప్రభుత్వానికి



నివేదించారు. రకరకాల కారణాలతో వాయిదా పడుతూ వస్తున్న ఈ విలువ పెంపుపై త్వరలోనే నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం యోచిస్తోంది. తాజాగా నివేదిక ఇవ్వాలని కోరడంతో పెంపు ఖాయమనే చర్చ జరుగుతోంది.

రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ చైర్మన్‌గా, జాయింట్ ఐజీ కన్వీనర్‌గా వ్యవహరించే లో సీసీఎల్ఏ కార్యదర్శి, ఇతర శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ భూముల మార్కెట్ విలువలను సమీక్షించి, అవసరమైన సిఫార్సులతో ప్రభుత్వానికి నివేదిక అందజేస్తుంది. మంగళవారం రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయంలో సీవీఏసీ సమావేశమై మార్కెట్ విలువలపై చర్చించింది. త్వరలో మరోసారి సమావేశమై పూర్తి స్థాయి నివేదికను ప్రభుత్వానికి సమర్పించనుంది. భూముల విలువలను ఎంత పెంచాలనేది ప్రభుత్వమే నిర్ణయించుకోవాలని, అయితే ఈ పెంపు శాస్త్రీయంగా ఉండాలని థర్డ్ పార్టీ ఏజెన్సీ తన నివేదికలో పేర్కొంది.

అధికారులు తయారు చేసిన నివేదిక శాస్త్రీయంగా ఉందా, భూముల వాస్తవ ధరలకు, పుస్తక విలువలకు మధ్య ఉన్న వ్యత్యాసం ఎంత, దానిని సవరించాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, శాస్త్రీయంగా పెంచడం వల్ల కలిగే ప్రయోజనాలు వంటి అంశాలపై ఏజెన్సీ తన అభిప్రాయాన్ని తెలియజేసింది. ఈ నిర్ణయం ప్రభుత్వానికి అదనపు ఆదాయాన్ని సమకూర్చడమే కాకుండా.. భూముల మార్కెట్ విలువలను వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా తీసుకురావడంలో సహాయపడతాయని అధికారులు భావిస్తున్నారు.

## రేషన్‌కార్డులపై కీలక అప్డేట్.. జూన్ మొదటివారం నుంచే..

తెలంగాణ: కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న ప్రజలకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. జూన్ మొదటి వారం నుంచి హైదరాబాద్‌లో రేషన్ కార్డుల దరఖాస్తుల వెరిఫికేషన్ ప్రారంభించనున్నట్లు పౌరసరఫరాల శాఖ తెలిపింది. సిబ్బంది కొరత కారణంగా ఆలస్యమైన ఈ ప్రక్రియ, అదనపు సిబ్బంది రాగానే వేగవంతం కానుందన్నారు. అర్హులైన వారికి కొత్త కార్డులు జారీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. రేషన్‌కార్డుల దరఖాస్తులకు ఆఖరి గడువు లేదని, ఇది నిరంతర ప్రక్రియ అని స్పష్టం చేశారు.

తెలంగాణ ప్రజలు రేషన్ కార్డుల కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. ఈక్రమంలో కాంగ్రెస్ సర్కార్.. రేషన్ కార్డుల మంజూరుకు రెడీ అయ్యింది. ఇప్పటికే ప్రజాపాలన ద్వారా కొత్త రేషన్ కార్డులకోసం దరఖాస్తులు తీసుకుంది. ఈక్రమంలో రేషన్‌కార్డులపై ప్రభుత్వం కీలక అప్డేట్ వెల్లడించింది. జూన్ మొదటి వారం నుంచే ఆ పని ప్రారంభించేందుకు రెడీ అయ్యింది.

ఇప్పటికి చాలా మంది కొత్త రేషన్‌కార్డుల కోసం అప్లై చేసుకుంటూనే ఉన్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారు.. కొత్త కార్డుల మంజూరు ఎప్పటి నుంచి ఉంటుందా అని ఎదురుచూస్తున్నారు. ఇంకా దరఖాస్తుల పరిశీలన కూడా మొదలు కాకపోవడంతో జనాలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో దీనిపై కీలక అప్డేట్ వెలుగులోకి వచ్చింది. జూన్ మొదటి వారంలో.. హైదరాబాద్‌కు సంబంధించిన కొత్త రేషన్ కార్డుల దరఖాస్తుల వెరిఫికేషన్ మొదలుపెట్టనున్నట్టు పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారి ఒకరు స్పష్టం చేశారు. పెద్ద ఎత్తున అప్లై చేస్తుండటంతో.. పరిశీలనకు అడ్డంకిగా మారిందన్నారు.




**సిబ్బంది కొరత వల్ల ఆలస్యం..**

ప్రస్తుతం హైదరాబాద్ నగరంలోని తొమ్మిది సర్కిళ్ల పరిధిలో మొత్తం 6,39,451 రేషన్‌కార్డులున్నాయి. తాజాగా దాదాపు 4 లక్షల వరకు కొత్తగా రేషన్‌కార్డుల కోసం అప్లై చేసుకున్నారు. అయితే చాలా మంది 2, 3సార్లు దరఖాస్తు చేసుకుంటున్నారని అధికారులు తెలిపారు. బల్దియా, కలెక్టరేట్ ప్రజావాణితో పాటు, ఈసేవ ద్వారా ఇంకా అప్లై చేస్తూనే ఉన్నారని వెల్లడించారు. లక్షల్లో ఉన్న దరఖాస్తులను పరిశీలించడానికి.. ప్రస్తుతం సీఆర్ఓ పరిధిలో సరిపడా సిబ్బంది లేరని అధికారులు వెల్లడించారు. అందుకే అదనపు సిబ్బంది కావాలంటూ రెవెన్యూ, బల్దియాలకు లేఖలు రాశామని తెలిపారు.

ఈ నెలాఖరులో ఇతర శాఖల నుంచి డిప్యుటేషన్‌పై సిబ్బంది వచ్చే అవకాశం ఉందని.. వారు రాగానే జూన్ మొదటి వారం నుంచి రేషన్కార్డుల వెరిఫికేషన్, ఇంటింటి తనిఖీ చేస్తామని అధికారులు చెప్తున్నారు. అర్హుల గుర్తింపు తర్వాత కొత్త కార్డుల జారీ మొదలవుతుందన్నారు. అదనపు సిబ్బంది వచ్చే వరకు.. ప్రస్తుతం ఉన్న స్టాఫ్‌తో కొత్త సభ్యుల చేర్పు, చనిపోయిన వారు, అనర్హుల తొలగింపు కార్యక్రమం చేపడుతున్నట్టు అధికారుల వెల్లడించారు. మరోవైపు రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు అంటూ ఏమీ లేదని.. ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు.

## హైదరాబాద్‌లో రెడ్ అలర్ట్.. ఎవరూ బయకు రావొద్దంటున్న అధికారులు



హైదరాబాద్: మే నెల అటే.. సాధారణంగా మాడు పగిలే ఎండలు ఉంటాయి. కానీ ఈ ఏడాది మాత్రం వాతావరణం ఇందుకు భిన్నంగా ఉంది. మే నెలలో భారీ ఎత్తున వర్షాలు కురుస్తున్నాయి. నేడు అనగా బుధవారం నాడు హైదరాబాద్‌లో భారీ వర్షం కురిసింది. నగరంలోని పలు ప్రాంతాల్లో కుండపోత వాన కురవడంతో అధికారులు నగరవాసులకు రెడ్ అలర్ట్ జారీ చేశారు.

హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో నేడు భారీ వర్షం కురుస్తోంది. దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట్, నాంపల్లి, చార్మినార్, కోటి, అబిడ్స్, రామంతపూర్, అంబర్‌పేట్ సహా పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తోంది. దీంతో వాహనదారులు, బాటసారులు ఇబ్బందులు పడుతున్నారు. అలానే శంషాబాద్, ఆరాంఘర్, చంద్రాయణగుట్ట, అత్తాపూర్,రాజేంద్రనగర్, టోలిచౌకి, మెహదీపట్నం, లంగర్‌హౌజ్, గచ్చిబౌలి, నార్సింగ్, బండ్లగూడ, నానక్‌రామ్‌గూడ, శేరిలింగంపల్లి,పటాన్‌చెరు, మియాపూర్ ప్రాంతాల్లో రానున్న రెండు గంటల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. అలానే రానున్న మూడు గంటల పాటు సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్,రంగారెడ్డి, యాదాద్రి, జనగాం, హనుమకొండ, వరంగల్, కామారెడ్డి,సిరిసిల్ల, కరీంనగర్,ములుగు, భూపాలపల్లి,పెద్దపల్లి ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలంగాణ వెదర్‌మాన్ పోస్ట్ చేశాడు. భారత వాతావరణ కేంద్రం అధికారులు తెలంగాణకు రెయిన్ అలర్ట్ జారీ చేసిన సంగతి తెలిసిందే.. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో నేడు, రేపు తెలంగాణలో మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని, గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని పేర్కొంది. హైదరాబాద్‌తో పాటు మధ్య తెలంగాణలో జల్లులు, కొన్నిచోట్ల మోస్తరు వర్షం కురుస్తుందని, మధ్యాహ్నం 3 గంటల తర్వాత తెలంగాణ వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. అందుకు తగ్గట్టుగానే ప్రస్తుతం నగరంలో భారీ వర్షం కురుస్తుంది. అలానే తెలంగాణలో 4 రోజుల పాటు తుపాన్ తరహా వర్షాలు కురుస్తాయని అధికారులు తెలిపారు.

వర్షం ధాటికి లోతట్టు ప్రాంతాలతో పాటు రహదారులు జలమయం అయ్యాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాతబస్తీతో పాటు శివారు ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తుండటంతో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించింది. రాత్రి వరకు వాతావరణం ఇలానే ఉంటుంది అంటున్నారు. ఏపీలోని పలు ప్రాంతాల్లో నేడు భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

## హైదరాబాద్‌లో సొంత ఇల్లు ఉన్న వారికి అలర్ట్..

### విద్యుత్ శాఖ కీలక రూల్స్ జారీ.. పాటించకపోతే కఠిన చర్యలు..!

హైదరాబాద్: ఓల్డ్ సిటీలోని గుల్జార్ హౌస్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో 17 మంది మరణించడంతో, చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టరేట్ ప్రజలకు కీలక సూచనలు చేసింది. ఆసుపత్రులు, భవనాలు, వాణిజ్య సముదాయాలు విద్యుత్ భద్రతా నిబంధనలు పాటించాలని, లైసెన్స్ కలిగిన ఎలక్ట్రీషియన్లతోనే పనులు చేయించాలని ఆదేశించింది. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. వైరింగ్, ఇన్స్టాలేషన్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పాత వైర్లను మార్చాలని సూచించింది. పూర్తి వివరాలు..

హైదరాబాద్ ఓల్డ్ సిటిలోని గుల్జార్ హౌస్ వద్ద చోటు చేసుకున్న భారీ అగ్ని ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈప్రమాదంలో మొత్తం 17 మంది చనిపోయారు. ఈ నేపథ్యంలో చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టరేట్.. ప్రజలకు కీలక సూచనలు చేసింది. విద్యుత్ భద్రతా నిబంధనలు కచ్చితంగా పాటించాలని చెప్పుకొచ్చింది. ఆస్పత్రులు, మల్టీ స్టోర్డ్ బిల్డింగులు, బహుళ అంతస్థుల అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాలు, సినిమా హాళ్లు, హొటళ్లు, ఇతర ప్రజా సౌకర్యాలకు సంబంధించిన భవనాలకు ఈ నిబంధనలు వర్తిస్తాయని వెల్లడించింది.

విద్యుత్ సురక్షిత వినియోగం కోసం విద్యుత్ చట్టం 2003 నియమ నిబంధనలు, అదనపు మార్గదర్శకాలను అనురించాలని విద్యుత్ ఇన్‌స్పెక్టరేట్ స్పష్టం చేసింది. నియమాలను ఉల్లంఘించినా.. నిబంధనలు పాటించకపోయినా విద్యుత్ చట్టం 2003 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని మంగళవారం ఓ ప్రకటనలో హెచ్చరించింది.

**అధికారులు విడుదల చేసిన మార్గదర్శకాలు ఇవే..**

భవనాల్లో విద్యుత్ పనులన్నింటిని లైసెన్స్ పొందిన ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్లు, నైపుణ్యం కలిగిన వైర్‌మెన్, అనుమతి కలిగిన వారి పర్యవేక్షణలో జరగాలని ప్రకటనలో తెలిపారు.

- లైటింగ్ సర్క్యూట్‌లకు 30 ఎంఏ ఈఎల్సీబీ/ ఆర్‌సీసీబీ, పవర్ సర్క్యూట్‌లకు 100 ఎంఏ ఈఎల్‌సీబీ అమ్మర్చాలని వెల్లడించారు.
- విద్యుత్ వైరింగ్, ఇన్‌స్టాలేషన్‌లు సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ రెగ్యులేషన్స్ 2023, నేషనల్ బిల్డింగ్ కోడ్ 2016 ఐఎస్/ఐఈసీ ప్రమాణాలకు లోబడి ఉండాలన్నారు.
- లైటింగ్‌కు 1.5 స్క్వేర్ మిల్లీమీటర్, పవర్ పాయింట్లకు 2.5 స్క్వేర్ మిల్లీమీటర్, ఏసీ యూనిట్లకు 4 స్క్వేర్ మిల్లీమీటర్ ఉండే సరైన కేబుల్ సైజులను వాడాలని సూచించారు.
- వోల్టేజ్ హెచ్చుతగ్గులున్న ప్రాంతాల్లో స్టెబిలైజర్లను ఉపయోగించాలి అన్నారు.
- ఫైనల్ సబ్‌సర్క్యూట్లు 10 పాయింట్లు లేదా 800 డబ్ల్యూ కంటే తక్కువగా ఉండాలని సూచించారు.
- ఓవర్‌హీటింగ్ నివారణకు లోడ్‌ను సమతుల్యం చేయాలని తెలిపారు.
- హార్మోనిక్స్ ఉన్న చోట ఫిల్టర్లను అమర్చి..హై పవర్ ఫ్యాక్టర్‌ను నిర్వహించాలన్నారు.
- ఒకే స్విచ్‌బోర్డ్‌కు బహుళ ఫేజ్‌లను కనెక్ట్ చేయకూడదన్నారు.
- అత్యవసర సమయాల్లో సరఫరా నిలిపివేయడానికి ఐసోలేషన్ స్విచ్‌లను అందుబాటులో ఉంచాలని సూచించారు.
- అదనంగా ఆస్పత్రుల్లో ఐటీ సిస్టమ్ ఎర్తింగ్, మెడికల్ ఐసోలేషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఇన్సులేషన్ మానిటరింగ్ సిస్టమ్‌లను వాడాలని సూచించారు. అలానే ఆర్సీసీబీలు, ఎంసీబీలను క్రమం తప్పకుండా పరీక్షించాలని సూచించారు.

అలానే సర్జ్ ప్రొటెక్షన్ డివైజ్‌లు, ఫైర్‌రేటెడ్ సీలెంట్లు, మండే పదార్థాలకు దూరంగా స్విచ్‌బోర్డులను ఉంచాలని తెలిపారు. అలానే 15 ఏళ్లు దాటిన వైర్లను తొలగించి కొత్త వైర్లను ఏర్పాటు చేయడం వంటి మార్గదర్శకాలను జారీ చేశారు. వీటిని కచ్చితంగా పాటించాలని కోరారు.

## యువ వైద్యురాలిపై లైంగిక దాడి

హైదరాబాద్: ఆడ పిల్లలు, మహిళలపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయి. ఎన్ని కఠిన చట్టాలు తీసుకొచ్చినా.. వారిపై దారుణాలు మాత్రం ఆగటం లేదు. తాజాగా.. హైదరాబాద్‌లో ఓ యువ వైద్యురాలిని ఓ కామాంధుడు మోసం చేశాడు. పెళ్లి పేరుతో ఆమెను నమ్మించి కోరిక తీరిన తర్వాత మ్నెహం చాటేశాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించటంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది.

మహిళలు, బాలికలపై జరుగుతున్న దారుణాలు రోజురోజుకూ పెరుగుతూనే ఉన్నాయి. ఎన్ని కఠిన చట్టాలు వచ్చినా, ఎంతమంది నేరస్తులను కఠినంగా శిక్షించినా.. కామాంధుల ఆలోచనల్లో మార్పు రాకటం లేదు. ఈ అకృత్యాలు పెరగటమే కాదు.. వాటి స్వభావంలోనూ క్రూరత్వం పెరుగుతోంది. సమాజంలో మహిళల పట్ల అవగాహన, గౌరవం లేకుండా కన్నూమిన్నూ కానకుండా దారుణాలకు ఒడిగడుతున్నారు. తాజాగా.. హైదరాబాద్ నగరంలో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. పెళ్లి పేరుతో ఓ వైద్యుడు.. యువ వైద్యురాలిపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఆమెను నమ్మించి మోసం చేశాడు. బంజారాహిల్స్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగుచూసింది.

నిలోఫర్ ఆసుపత్రిలో డాక్టర్‌గా పనిచేస్తున్న ఓ యువతికి మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్‌గా పనిచేస్తున్న స్వామి పరిచయం అయ్యాడు. ఆ పరిచయం కాస్తా ప్రేమగా మారింది. ఇద్దరూ చెట్టాపట్టాలేసుకొని తిరిగారు. 'నిన్నే పెళ్లి చేసుకుంటా' అని స్వామి ఆ యవ డాక్టర్‌కు నమ్మించాడు. అతడి మాటలు పూర్తిగా నమ్మిన యువ డాక్టర్.. అతడు చెప్పినట్లు చేసింది. ఈ క్రమంలో ఓ రోజు బాధితురాలిని బంజారాహిల్స్‌లోని స్టార్ హొటల్‌కు తీసుకెళ్లాడు. అక్కడ రూం బుక్ చేసి తనలోని కామవాంఛను తీర్చుకున్నాడు. ఇవన్నీ పెళ్లి తర్వాతే అని బాధితురాలు వద్దని వారించినా కామంతో కళ్లుమూసుకొని ఆమెపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఆ తర్వాత తనను పెళ్లి చేసుకోవాలని యువతి ప్రస్తావన తీసుకొచ్చింది.

అయితే ఈ ఏడాది జనవరిలోనే పెళ్లి చేసుకుంటానని నమ్మబలికిన స్వామి.. ఆ తర్వాత మ్నెహం చాటేశాడు. పెళ్లి ప్రస్తావన తీసుకొచ్చిన ప్రతిసారీ మాయమాటలతో తప్పించుకునే వాడు. పెళ్లి పేరుతో తనను శారీరకంగా వాడుకొని మోసం చేశాడని గ్రహించిన బాధితురాలు.. బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు స్వామిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు సమాజంలో మహిళల భద్రతపై తీవ్ర ఆందోళనను పెంచుతున్నాయి. ఆడపిల్లలు కొత్త వారితో పరిచయాలు ఏర్పరచుకునేటప్పుడు ఎంత అప్రమత్తంగా ఉండాలో ఈ ఘటన మరోసారి గుర్తు చేస్తోంది.

## పంచాయతీ కార్యదర్శి పోస్టు ఖాళీ..

వికారాబాద్: జిల్లా కరన్‌కోట్ పంచాయతీ కార్యదర్శి పోస్టు ఖాళీగా ఉండటంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో పనిచేసిన కార్యదర్శి బదిలీ కావడంతో పారిశుధ్యం, తాగునీటి సరఫరా వంటి పనులు సక్రమంగా జరగడం లేదు. రాజీవ్ యువ వికాసం స్కీమ్ లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి పనులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వెంటనే రెగ్యులర్ కార్యదర్శిని నియమించాలని గ్రామస్తులు కోరుతున్నారు. తాండూరు ఎంపీఓ సుశీల్‌కుమార్ స్పందిస్తూ ఒకటి రెండు రోజుల్లో సీనియర్ కార్యదర్శికి బాధ్యతలు అప్పగిస్తామని తెలిపారు.

వికారాబాద్ జిల్లాలోని కరన్‌కోట్, ఒక పెద్ద గ్రామ పంచాయతీ. ఈ గ్రామానికి శాశ్వత పంచాయతీ కార్యదర్శి లేకపోవడం వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఇక్కడ విధులు నిర్వర్తించిన ఆనంద్‌రావు బదిలీపై యాలాల మండలానికి వెళ్లినప్పటి నుంచి ఈ కీలకమైన పదవి ఖాళీగా ఉంది. ఓగిపూర్ కార్యదర్శి అమరేశ్వరి కొద్దికాలం ఇన్‌చార్జిగా వ్యవహరించినప్పటికీ, ఆమె కూడా ప్రస్తుతం ఆ బాధ్యతల నుండి తప్పుకున్నట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితి గ్రామ పరిపాలనను అస్తవ్యస్తం చేస్తోంది.

సుమారు 14 వేల జనాభా, 14 వార్డులు, 7,800 మంది ఓటర్లు ఉన్న కరన్‌కోట్ వంటి పెద్ద గ్రామానికి పూర్తిస్థాయి కార్యదర్శి అవసరం ఎంతైనా ఉంది. గ్రామ శివారులో సీసీఐ ఫ్యాక్టరీతో పాటు నాపరాతి గనులు ఉండటం వల్ల ఇక్కడ కార్యకలాపాలు అధికంగా ఉంటాయి. ప్రస్తుతం 16 మంది పంచాయతీ సిబ్బంది పనిచేస్తున్నప్పటికీ.. కార్యదర్శి లేకపోవడంతో పనులు సక్రమంగా జరగడం లేదు. ఒకవైపు పారిశుద్ధ్య పనులు చేస్తుంటే.. మరోవైపు చెత్త పేరుకుపోతోందని గ్రామస్తులు వాపోతున్నారు. వేసవి కాలం కావడంతో తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ అవసరం. మిషన్ భగీరథ నీరు నిలిచిపోతే కొన్ని కాలనీల్లో ప్రజలు దాహంతో అల్లాడుతున్నారు. ఇలాంటి కీలక సమస్యల పరిష్కారానికి కార్యదర్శి నిరంతరం అందుబాటులో ఉండాలి.

## ఫేక్ ఆధార్, ఐడీలతో నగరంలో నివాసం

హైదరాబాద్: అక్రమంగా నివసిస్తున్న నలుగురు రోహింగ్యాలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి ఫేక్ ఆధార్ కార్డులు సహా పలు నకిలీ ధ్రువపత్రాలు స్వాధీనం చేసుకున్నారు. 2011 నుంచి అక్రమంగా నివసిస్తున్న మహమ్మద్ అర్మాన్, అతని భార్య రుమానా, సోదరుడు నయీం, మదర్సా టీచర్ హారిస్‌లు అరెస్ట్ అయ్యారు. ఫేక్ పత్రాలు సమకూర్చిన మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. ఈ ఘటనతో రోహింగ్యాల అక్రమ నివాసంపై ఆందోళన వ్యక్తం అవుతోంది.

నగరంలో అక్రమంగా నివసిస్తున్న నలుగురు రోహింగ్యాలను రాచకొండ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి ఫేక్ ఆధార్ కార్డులు సహా పలు ధ్రువపత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ అరెస్టుతో రోహింగ్యాల అక్రమ నివాసం, నకిలీ పత్రాల వ్యవహారం మరోసారి వెలుగులోకి వచ్చింది. ఎల్‌బీనగర్ ఎస్‌వోటీ, హయత్‌నగర్ పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. మయన్మార్‌కు చెందిన మహమ్మద్ అర్మాన్ అలియాస్ సయ్యద్-ఉల్-అమిన్ (32), అతని భార్య మహమ్మద్ రుమానా అక్తర్ అలియాస్ ముస్తఖున్నీసా (26) 2011లో అక్రమంగా భారత్‌లోకి ప్రవేశించి అప్పటి నుంచి హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. వీరికి హాఫీజ్‌బాబానగర్‌లోని జామియా సరియా మదర్సాలో టీచర్‌గా పనిచేస్తున్న మయన్మార్ జాతీయుడు మహమ్మద్ హారిస్ అలియాస్ మహమ్మద్ రిజ్వాన్, రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆగపల్లికి చెందిన మదర్సా టీచర్ అయాజ్ పరిచయమయ్యారు.

ఈ ఇద్దరు మదర్సా టీచర్లు అర్మాన్‌కు ఫేక్ ఐడెంటిటీ కార్డులు సమకూర్చగా.. వాటి ఆధారంగా రంగారెడ్డి జిల్లా మంచాలలోని మీసేవ కేంద్రం ద్వారా అర్మాన్ ఆధార్ కార్డు పొందాడు. నకిలీ నిఖా సర్టిఫికెట్‌తో రుమానాకు కూడా ఆధార్ ఇప్పించాడు. 2016లో మయన్మార్ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన అర్మాన్ సోదరుడు మహమ్మద్ నయీం అలియాస్ హైరుల్ అమిన్ (20)కు బాలాపూర్‌కు చెందిన షోయబ్‌మాలిక్ అనే మయన్మార్ జాతీయుడు నకిలీ పత్రాలు సమకూర్చి ఆధార్ కార్డు ఇప్పించాడు. ఈ ఆధార్ కార్డుల సహాయంతో అర్మాన్ కుటుంబం పాన్‌కార్డులు, ఓటర్ ఐడీలు, డ్రైవింగ్ లైసెన్సులు, బ్యాంకు ఖాతాలు, ఎల్ఐసీ పాలసీలు కూడా పొందారు.

వీరి వ్యవహారంపై పక్కా సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్ ఎస్‌వోటీ, హయత్‌నగర్ పోలీసులు మంగళవారం (మే 20) అర్మాన్, రుమానా, నయీం, మదర్సా టీచర్ హారిస్‌లను అరెస్టు చేశారు. వారి నుంచి 5 ఆధార్ కార్డులు, 2 పాన్‌కార్డులు, 5 ఓటర్ ఐడీలు, డ్రైవింగ్ లైసెన్స్, 2 ఎల్ఐసి పాలసీలు, 3 ఏటీఎం కార్డులు, గ్యాస్ బుక్, 4 బ్యాంకు పాస్ పుస్తకాలు, నాలుగు ఫేక్ బర్త్ సర్టిఫికేట్లు, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అయాజ్, షోయబ్ మాలిక్ ప్రస్తుతం పరారీలో ఉన్నారు. ఈ అరెస్టుల నేపథ్యంలో రోహింగ్యాల అక్రమ నివాసంపై తీవ్ర ఆందోళన వ్యక్తం అవుతోంది. రాష్ట్రంలో అక్రమంగా నివసిస్తున్న రోహింగ్యాలను గుర్తించి, వారిని వెంటనే వెనక్కి పంపాలని, నకిలీ పత్రాల వెనుక ఉన్న పూర్తి నెట్‌వర్క్‌ను ఛేదించి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఇది రాష్ట్ర భద్రతకు సంబంధించిన విషయమని, ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## హెచ్ఎండీఏ భారీ లేఅవుట్లు..

తెలంగాణ: తెలంగాణ ప్రభుత్వం అదనపు ఆదాయం కోసం హెచ్ఎండీఏ లేఅవుట్లను అభివృద్ధి చేసి ప్లాట్లను వేలం వేస్తోన్న సంగతి తెలిసిందే. ఈ నిధులను నగరాభివృద్ధి, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, ఇతర ప్రజా ఉపయోగ పనులకు వెచ్చిస్తున్నారు. గతంలో కోకాపేట్, మోకిల వంటి ప్రాంతాల్లో వేలం ద్వారా హెచ్ఎండీఏ వేల కోట్ల ఆర్జించింది. హైడ్రా భయాలు, ప్రభుత్వ లేఅవుట్లు కావటంతో చాలా మంది కొనుగోలు చేసేందుకు ముందుకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో మరికొన్ని ప్రాంతాల్లో హెచ్ఎండీఏ లే అవుట్లు వేయాలని భావిస్తోంది. తన పరిధిలో ల్యాండ్ పూలింగ్ ప్రక్రియను తిరిగి ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. రైతుల నుంచి వ్యవసాయేతర భూములను సమీకరించి, వాటిని భారీ లేఅవుట్లుగా అభివృద్ధి చేసి విక్రయించడం ద్వారా ప్రణాళికాబద్ధమైన అభివృద్ధిని సాధిం చాలని లక్ష్యంగా పెట్టుకుంది. మహానగరం చుట్టూ ఉన్న గ్రామాల్లోని రైతుల వ్యవసాయేతర భూములను వారి ఇష్టపూర్వక సమ్మతితో సమీకరించి అభివృద్ధి చేసేందుకు ప్రయత్నిస్తోం ది. ఇందులో భాగంగా తొలుత రంగారెడ్డి జిల్లాలోని ఇమ్ములనర్వలో 95.25 ఎకరాలు, లేమూరులో 83.48 ఎకరాల్లో లేఅవుట్ అభివృద్ధి పనులను ప్రారంభించింది. అయితే మధ్యలో ఈ ప్రాజెక్టుకు బ్రేక్ పడగా.. తిరిగి ప్రారంభించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. అభివృద్ధి చేసిన భూమిలో 60 శాతం భూమిని రైతులకు తిరిగి బదిలీ చేస్తుంది. మిగిలిన 40 శాతం భూమిని హెచ్ఎండీఏ విక్రయిస్తుంది. గతంలో రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలో దాదాపు 924.28 ఎకరాలను అధికారులు భూ సమీకరణ కోసం పరిశీలించారు. ఇటీవల హెచ్ఎండీఏ పరిధి 7200 చదరపు కిలోమీటర్ల నుంచి 11 వేల చదరపు కిలోమీటర్లకు విస్తరించింది. 2050 నాటి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కొత్త మాస్టర్‌ప్లాన్‌కు రూపకల్పన జరుగుతోంది. భవిష్యత్తులో నగరాభివృద్ధి మొత్తం ఔటర్ రింగ్ రోడ్డు హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు చుట్టూ కేంద్రీకృతం అవుతుందని అంచనా వేస్తోంది. ఈ ప్రాంతాల్లో నివాసము దాయాలు, విల్లాలు, వాణిజ్య, వ్యాపార శాటిలైట్ టౌన్‌షిప్‌లకు భారీ డిమాండ్ ఉంటుందని భావిస్తున్నారు. ప్రభుత్వ భూములు అన్ని ప్రాంతాల్లో అందుబాటులో లేకపోవడంతో, వ్యవసాయానికి పనికిరాని భూములను సమీకరించడం ద్వారా డిమాండ్‌ను తీర్చాలని హెచ్ఎండీఏ యోచిస్తోంది.



# ఆర్ముగ్‌కుమార్ ఆదుకోవడంతోనే ఈ స్థాయిలో ఉన్నా

తమిల నటుడు విజయ్ సేతుపతి వెల్లడి

తమిళ స్టార్ హీరో విజయ్ సేతుపతి గురించి ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. విలక్షణ నటుడిగా అన్ని భాషల్లోనూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. హీరోగా మాత్రమే కాకుండా ఎలాంటి పాత్ర అయిన పడించగల సతా ఉన్నవాడు. ముఖ్యంగా విలన్‌గా విజయ్ యాక్టింగ్‌కి విపరీతమైనా ఫ్యాన్ ఫాలోయిండ్ ఉంది. ప్రస్తుతం 'ఏస్'సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్న విజయ్ తాజాగా ఆయన ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్ తొలి రోజుల్ని గుర్తుచేసుకున్నారు. విజయ్ మాట్లాడుతూ.. ' కెరీర్ ఆరంభంలో అవకాశాల కోసం ఎదురు చూస్తున్న తరుణంలో 'వర్ణం' అనే సినిమాకు ఆడిషన్‌కు వెళ్లాను. తీరా అక్కడికి వెళ్లాక సీన్ చెప్పి డైలాగులు కూడా నన్నే రాసుకొని నటించమన్నారు. అప్పుడే తెలుసుకున్న నేను డైలాగులు కూడా రాయగలనని. ఆర్ముగ కుమార్ ఆ టీమ్‌కు నా పేరు సజెస్ట్ చేశారు. అలా ఆ సినిమాలో అవకాశం వచ్చింది. అలాగే క్లాసిక్ మూవీ '96'లో నేను నటించడానికి కూడా ఆయనే కారణం. 'ఒకసారి ఈ సినిమాకు విజయ్ సేతుపతి ఆడిషన్ తీసుకోండి. పాత్రకు సరిపోడు అనుకుంటే తిరస్కరించండి' అని ఆర్ముగ కుమార్ '96' టీమ్‌కు చెప్పారు. మనం అంటూ ఒక స్థాయి వచ్చాక ఎవరైనా సహాయం చేయడానికి ముందుంటారు. కానీ మనం ఎవరో తెలియనప్పుడు కూడా సహాయం చేయడం గొప్ప. ఆ సాయం చీకటితో నిండిన ఇంట్లో దీపం వెలిగించడం లాంటింది. అలా నా జీవితంలో ఆ దీపాన్ని వెలిగించిన మనిషి ఆర్ముగ కుమార్. అతడికి ఎప్పటికీ రుణపడి ఉంటాను' అని విజయ్ సేతుపతి అన్నారు.




# రాజ్ సమంతల వ్యవహారం

ఆసక్తి రేపుతోన్న రాజ్ భార్య పోస్ట్

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత గురించి రోజుకో న్యూస్ వైరల్ అవుతూనే ఉంది. మూవీస్ విషయం పక్కన పెడితే ఎక్కువగా తన వ్యక్తిగత విషయాలు ఏదో ఓ రూమర్ వినిపిస్తూనే ఉన్నాయి. ఇక సామ్ రెండో పెళ్లికి సిద్ధమైనట్లు, దర్శకుడు రాజ్ నిడిమోరుతో ఆమె ప్రేమలో పడిందని, గత కొంతకాలంగా ఇద్దరూ డేటింగ్ చేస్తున్నారంటూ బాలీవుడ్, టాలీవుడ్ మీడియాలో వరుస వార్తలు ప్రచారం అవుతున్నాయి. సమంత ఎక్కడ ఉంటే అక్కడ రాజ్ ఉంటున్నాడు.దీంతో నెట్టింట ఎక్కడ చూసినా వీరిద్దరి గురించే విపరీతంగా చర్చ నడుస్తోంది. ఈ రూమర్స్‌పై సమంతగానీ, రాజ్ గానీ ప్రత్యక్షంగా స్పందించలేదు.

కానీ రాజ్ నిడిమోరు భార్య శ్యామలి దే పెడుతున్న పోస్ట్‌లు చర్చకు దారితీస్తున్నాయి. తాజాగా ఆమె పెట్టిన ఓ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. 'మంచి కర్మను సృష్టించండి. ప్రజలకు సాయం చేయండి. అందరితో న్యాయంగా వ్యవహరించండి' అంటూ ఇన్‌స్టా స్టోరీస్‌లో పోస్టు పెట్టింది. అంతకు ముందు 'నా గురించి మాట్లాడేవారికి.. నా తరపున మాట్లాడేవారికి.. నేను చెప్పేది వినేవారికి.. నా గురించి వార్తలు వినేవారికి.. నా గురించి రాసే వారికి.. నా కోసం ఆలోచించేవారందరికీ దేవుడు ఆశీర్వాదం, ప్రేమ ఉండాలని కోరుకుంటున్నా' అనే పోస్ట్‌ను ఆమె షేర్ చేసింది. మొన్నటి వరకు సోషల్ మీడియాలో యాక్టివ్‌గా లేని శ్యామలి, సామ్-రాజ్ డేటింగ్ రూమర్స్ మొదలైనకానుండే సడన్ గా పోస్టులు పెడుతుంది. దీంతో ఆమె వీరిద్దరిని ఊదేశించే పెడుతున్నట్లు-గా కామెంట్స్ వినిపిస్తున్నాయి.

# తమ్ముడుకి దిల్ రాజు మెరుగులు..!

దిల్ రాజు బ్యానర్ నుంచి ఒక సినిమా వస్తుంది అంటే ఆ సినిమాకు అన్నీ తానై చూసుకుంటాడు దిల్ రాజు. కథ విని ఓకే చేసినప్పటి నుంచి షూటింగ్ లో ప్రతిదీ ప్రత్యేకంగా చూస్తాడు. అంతేకాదు సినిమా అవుట్ పుట్ ని కూడా అంచనా వేస్తాడు. ఎడిటింగ్ రూం లో ఫైనల్ మిక్సింగ్ లో రిలీజ్ ముందు ప్రమోషన్స్ ఇలా దిల్ రాజు అంటే నిర్మాతగా కాదు సినిమాకు అన్ని క్రాఫ్ట్స్ లో పనిచేసే ఒక టెక్నీషియన్ గా ఉంటాడు. ఎందుకంటే డబ్బులు పెట్టేది తనే కాబట్టి ఆయన అంత జాగ్రత్త పడటంలో




తప్పులేదు.ప్రస్తుతం దిల్ రాజు బ్యానర్ లో కొన్ని ఇంట్రెస్టింగ్ కాంబినేషన్ సినిమాలు వస్తున్నాయి. అందులో నితిన్ హీరోగా వస్తున్న తమ్ముడు కూడా ఉంది. దిల్ రాజు బ్యానర్ లో ఆస్థాన దర్శకుడు అయిన వేణు శ్రీరామ్ డైరెక్షన్ లో తమ్ముడు సినిమా వస్తుంది. ఈ సినిమా విషయంలో దిల్ రాజు చాలా నమ్మకంగా ఉన్నాడు. సినిమాలో నితిన్ తో పాటు ఒకప్పటి హీరోయిన్ లయ కూడా ఇంపార్టెంట్ రోల్ లో నటిస్తుంది. సినిమాలో మేజర్ హైలెట్స్ లో ఆమె రోల్ కూడా ఒకటని అంటున్నారు.తమ్ముడు సినిమా నుంచి రీసెంట్ గా ఒక స్పెషల్ టీజర్ రిలీజైంది. అందులో పాత్రలను పరిచయం చేసి సినిమా ఎలా ఉండబోతుందో అని రుచి చూపించారు.



# 860 కోట్ల బడ్జెట్ సినిమాలో రష్మిక

ఇటీవలి కాలంలో 200 కోట్ల నుంచి 300 కోట్ల మధ్య బడ్జెట్ తో తెరకెక్కిన సినిమాల్లో నటించింది రష్మిక మందన్న. యానిమల్, పుష్ప 2, చావా లాంటి చిత్రాలు ఈ స్థాయి బడ్జెట్లతో రూపొందించినవే. కానీ ఇప్పుడు ఏకంగా 860 కోట్ల (100 మిలియన్ డాలర్లు) బడ్జెట్ తో రూపొందించిన వాల్ట్ డిస్నీ లో అండ్ స్టిచ్ ప్రాజెక్ట్ లో రష్మిక భాగమైంది. ఇప్పుడు రష్మిక అంతర్జాతీయంగా ఫేమస్ కాబోతోంది.కెరీర్ ప్రారంభించిన కేవలం నాలుగైదేళ్లలోనే టాలీవుడ్ లో అగ్ర కథానాయికగా ఎదిగేసిన రష్మిక, ఆ తర్వాత బాలీవుడ్ లోను పాపులర్ హీరోలతో నటించింది. ఇటీవలే బ్యాక్ టు బ్యాక్ యానిమల్, పుష్ప 2, చావా లాంటి బ్లాక్ బస్టర్లలో నటించి లక్కీ ఛామ్ గా మారింది. పుష్ప 1800 కోట్లు వసూలు చేయడం ఒక సెన్సేషన్ కాగా, యానిమిల్, చావా 800 కోట్లు పైగా వసూలు చేసాయి.అందుకే ఇప్పుడు డిస్నీ సంస్థ లో అండ్ స్టిచ్ ప్రమోషన్స్ కోసం రష్మికను ఫ్రంట్ ఫేస్ గా ఎంపిక చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ చిత్రం 23 మే 2025న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా ఇన్‌స్టాలో రష్మిక ఒక ఎగ్జయిటింగ్ వీడియోను షేర్ చేసింది. ఈ వీడియోలో గ్రహాంతర స్నేహితురాలు స్టిచ్ కోసం లిలోగా రష్మిక రూపాంతరం చెందింది. భారతదేశంలో రష్మిక ఈ సినిమాని ప్రమోట్ చేయనుంది. ఈ సినిమా ఒరిజినల్ ఇంగ్లీష్ వెర్షన్‌తో పాటు తెలుగు, హిందీ, తమిళంలో విడుదల కానుంది. ఇది 2 ఫార్మాట్లలో అందుబాటులో ఉంటుంది. డీన్ ఫ్లీషర్ క్యాంప్ దర్శకత్వం వహించిన లో , స్టిచ్ భారతదేశంలోను మంచి బజ్‌ను సృష్టించింది. ఇప్పుడు అందరి దృష్టి భారతీయ బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా సాధించే విజయంపైనే. ఈ సినిమాని 100 మిలియన్ డాలర్ల బడ్జెట్ తో తెరకెక్కించగా, 200 మిలియన్ డాలర్లు పైగా వసూలు చేస్తే బ్రేక్ ఈవెన్ సాధించినట్టు.



# రాధిక గ్యాప్ తీసుకుందా.. లేక వచ్చిందా?

డీజే టిల్లు మూవీ తో రాధికగా కుర్రకారు గుండెల్లో ముద్ర వేసుకుంది నేహా శెట్టి. కర్ణాటకకు చెందిన ఈ వయ్యారి.. 2014లో మిస్ మంగళూరు టైటిల్ గెలుచుకుంది. 2015లో మిస్ సౌత్ ఇండియా రన్నరప్ గా నిలిచింది. దాంతో కన్నడ డైరెక్టర్ శశాంక్ 2016 లో ముంగారు మాలే 2 మూవీతో నేహా శెట్టిని హీరోయిన్ గా ఇండస్ట్రీకి పరిచయం చేశారు. ఈ సినిమా యావరేజ్ గా ఆడినప్పటికీ.. నేహా అందం, అభినయానికి ప్రశంసలు దక్కాయి. 2018లో పూరి జగన్నాథ్ డైరెక్ట్ చేసిన మెహబూబా మూవీ తో నేహా శెట్టి తెలుగు చిత్ర పరిశ్రమకు పరిచయం అయింది. ఈ మూవీ ఫలితం గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు.ఆ తర్వాత ఆరు నెలలు పాటు న్యూయార్క్ ఫిల్మ్ అకాడమీలో యాక్టింగ్ కోర్స్ తీసుకున్న నేహా శెట్టి.. 2021లో గల్లీ రౌడీ మూవీతో హీరోయిన్ గా రీఎంట్రీ ఇచ్చింది. ఇందులో సందీప్ కిషన్ కు జోడిగా నటించి ఆకట్టుకుంది. అదే ఏడాది మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ చిత్రంలో మేఘాగా మెరిసిన నేహా.. 2022లో డీజే టిల్లుతో బ్రేక్ అందుకుంది. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా తెరకెక్కిన ఈ చిత్రంలో నేహా శెట్టి పోషించిన రాధిక పాత్రకు ఎంతటి రీచ్ వచ్చిందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. డీజే టిల్లుతో రాధికగా గుర్తుండి పోయిన నేహా శెట్టి.. ఆ తర్వాత బెదురులంక 2012రూల్స్ రంజన్‌టిల్లు స్క్వేర్ వంటి చిత్రాల్లో నటించింది.చివరిగా విశ్వక్ సేన్‌తో కలిసి గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి సినిమాతో పలకరించింది. భారీ అంచనాల నడుమ విడుదలైన ఈ చిత్రం అనుకున్న స్థాయిలో ఆడలేదు. అయితే గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి వచ్చి ఏడాది కావొస్తున్నా నేహా శెట్టి నుంచి మరో సినిమా రాకపోవడం గమనార్హం. దాదాపు రెండేళ్ల క్రితం బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కు జోడిగా టైసన్ నాయుడు అనే సినిమాకు నేహా శెట్టి సంతకం చేసింది. భీమ్లానాయక్ హేమ్ సాగర్ కే. చంద్ర ఈ సినిమాకు దర్శకుడు. ప్రముఖ నిర్మాణ సంస్థ 14 రూల్స్ బ్యానర్ లో టైసన్ నాయుడు ప్రారంభమైంది.కానీ ఇంతవరకు షూటింగ్ పూర్తి కాలేదు. పడుతూ లేస్తూ అన్నట్టుగా చిత్రీకరణ జరుగుతుంది. గత ఏడాది నేపాల్ లో కొంత షూటింగ్ చేశారు. ఆ తర్వాత ఎటువంటి అప్డేట్ లేదు. అసలు ఈ చిత్రం ఉందా? ఆగిపోయిందా? అన్న విషయం కూడా తెలియని పరిస్థితి. ఇక గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి తర్వాత నేహా శెట్టి కొత్త ప్రాజెక్ట్‌లకు సైన్ చేసింది లేదు. మరి ఆఫర్లు లేక రాధికకు గ్యాప్ వచ్చిందా? లేక తనకు సెట్ అయ్యే కథలు రాక గ్యాప్ తీసుకుందా?